

# 17

## సుంకోజి దేవేంద్రాచారి

"ఈ వయసులో కూడా ఇంత యాక్టివ్‌గా ఎలా వున్నావు తాతయ్యా?"

నా మనవడి ప్రశ్నకు నవ్వొచ్చింది.

నాకు డెబ్బై రెండేళ్లు. ఈ వయసులో సహజంగా వచ్చే కంటిజబ్బులు, బిపి, షుగర్ లాంటివి నాకు రాలేదు. రాత్రిపూట పడుకుంటే కొంచేపట్లోనే కంటిమీదకు కునుకొచ్చేస్తాది. నేనీ నగరం వచ్చి నాలుగు రోజులయింది. రోజూ పొద్దనపూట ఐదారుమైళ్లు నడుస్తాండా. ఇంటికి అవసరమైన వస్తువులు నేనే బజారుకు పోయి తెస్తాండా. ఏమాత్రం అలుపుండదు.



# ఆకుపచ్చని లోకంలోకి...

“తాతయ్యా.. నిన్న నాకు హాలిడే కదా. రాత్రి పన్నెండు గంటలదాకా నాకు నిద్ర రాలా. నువ్వేమో పడుకున్న టూ మినిట్స్‌లోనే నిద్రపోయావు. నాకు తినింది సరిగా డైజెస్ట్ కావడం లేదు. నీకేమో ఏం తిన్నా డైజెస్ట్ అవుతోంది.... ఎందుకిలా?”

సాయంత్రం ఐదుగంటవుతోంది. ఆదివారం కావడంతో కొడుకూ, కోడలూ ఇంట్లోనే వున్నారు. ప్రతి ఆదివారం మిత్రులతో వెళ్లే శ్రీ కూడా ఈ రోజెందుకో ఇంట్లోనే ఉన్నాడు. వాడు ఈమధ్య కాలంలో నిద్ర సరిగా పట్టడం లేదని, భయం భయంగా ఉంటాందని, పనిపైన శ్రద్ధ ఉండటం లేదని అంటా ఉండాడు. ఈమధ్యే డాక్టర్ దగ్గర చూపించుకున్నాడు. అయినా అంతగా గుణం లేదంటా ఉండాడు.

“చెప్పు తాతయ్యా... వాటీజ్ ది సీక్రెట్ ఆఫ్ యువర్ హెల్త్” అన్నాడు శ్రీ.

“రా.. ఇద్దరం మాట్లాడుకుంటా నడుద్దాం. దార్లో చెప్తా” అన్నాను.

ఇంట్లో చెప్పి ఇద్దరం బయటపడ్డాం. బయట వాహనాల హారన్ మోత ఎక్కువగా ఉంది. వాటి పొగ కూడా ఎక్కువగానే ఉంది. వచ్చి పోయే మనుషులతో వీధులు రద్దీగా ఉన్నాయి. ఇలాంటి వీధుల్లో నడవాలంటే నాకు ఊపిరాడనట్టుగా ఉంటాది. నగరంలో ఉన్నాక వీటిని భరించాల్సిందే కదా.

వీధికి ఒక చివరగా ఇద్దరం నడవసాగాం.

“శ్రీ... నిన్ను రోజూ చూస్తాండా కదా... నువ్వు తినే తిండీ, చేసేపనీ, పడుకునే వేళ... ఇయ్యన్నీ ఆరోగ్యంపైన ప్రభావం చూపుతాయి.”

“మంచి తిండే తింటున్నాను. ఇంక శారీరక కష్టం కూడా ఉండదు. ఏసీ రూముల్లో జాబ్. అంతా హాయి గానే ఉంది కదా” అన్నాడు.

నాకు వాడి అమాయకత్వానికి నవ్వొచ్చింది.

“నువ్వు తినేది గూడా ఒక తిండేనా?”

“ఏం తాతయ్యా!”

“అవును. ఆ తిండి తిని, ఒళ్లు కదలకుండా, ఏసీ రూముల్లో ఉండి పని చేస్తే... ఇంగ నీకు ఆకలెందుకయితాది, తినింది ఎందుకరగతాది, నిద్రెట్ల పడతాది?” అన్నాను.

వాడు ఎక్కువగా తినేది నూనె పదార్థాలే.

శ్రీకి ఏమీ అర్థం కానట్టుంది. అయోమయంగా నా ముఖంలోకి చూశాడు.

“ముందుగా నా గురించి చెప్తాను. యిను. నేనేం తిన్నానో, ఎట్ల బతికినానో తెలిస్తే.. ఇప్పుడు నా ఆరోగ్యం వెనక రహస్యం తెలస్తాది” అన్నాను.

శ్రీ శ్రద్ధగా వింటున్నాడు.

“నాకిప్పుడు డెబ్బై రెండేండ్లు. నాకు పాతికేండ్ల వయసప్పుడు ఎట్లున్నేనో చెప్తాను. తిరుపతి దగ్గర మనూరు చూసినావుకదా. ఇప్పుడు మాదిర్తో కాదులే. అప్పుడు ఇంకా బాగుండేది. చుట్టూ చెట్లు, కుంటల్లో, చెరువుల్లో నీళ్లు.. బలే ఉండేదిలే.

వానాకాలంనించీ మొదులు పెడతా... తొలిముంగార్ల వానలు పడతాయిగదా. వాన పడిందంటే చాలు... మరుసటి రోజు మొబ్బుతోనే లేసి మడక భుజాన పెట్టుకుని ఎద్దల తోలుకోని, సేద్యం కాడికి పోతాంటి. చేన్లో మడక కట్టి దున్నడం మొదులు పెడితే మీ అమ్మమ్మ సద్ది తెచ్చే ఏళకు ఎకరా నేల



దున్నేస్తాంటి. సద్ది తాగేసినాంక మళ్లా దున్నేదే. పొద్దు బాగా ఎగబన్నేక దున్నేది ఆపేస్తాంటి. గొడ్లకు కూడా మేత కావద్దా. అయ్యో బతకాల గదా.. సంగటి తినేసి గొడ్లను తోలుకోని కొండకు పోతాంటి. కొండలో గొడ్లొకపక్క మేస్తాంటాయి. నా మాదిర్తో ఇంగా చానా మంది వచ్చింటారు కదా, గొడ్లను తోలుకోని. వోళ్లతో కలిసి ఆ గుండెక్కేది ఈ గుండెక్కేది. ఆ చెట్టు చూసేది, ఈ చెట్టు చూసేది.

సందేళదాంకా గొడ్లను మేపినాంక ఇంటికి తోలుకోనొస్తాం. ఇంటికొచ్చాలకు మీ అమ్మమ్మ నీళ్లు కాంచి బెట్టింటాది. వస్తానే నీళ్లు పోసుకుంటా. ఉడుకుడుకు సద్దసంగటి గిన్నెలో పెట్టిస్తాది. చెనిగ్గింజల ఊరిమిండి ఏసుకోని సంగటి తినేలకు రాత్రి ఎనిమిది గంటలు కూడా కాదు. కడుపారా తినేలకు, కండ్లమింద నిద్రతల్లి కాసుకోనుంటాది. పడుకుంటానే నిద్రొచ్చేస్తాది. అప్పుడు పడుకుంటే మళ్లా మెలకవ వచ్చేది తెల్లార్లు జామున కోడికూతకే.

ఒగరోజు మడక దున్నేది ఉంటాది...

ఒగరోజు అంద చెక్కేదుంటాది...

ఒగరోజు ఎరువు చిల్లాదే దుంటాది...

ఒగరోజు ఆకు కొట్టేదుంటాది...

ఒగరోజు కోత కోసేదుంటాది...

ఒగరోజు కుప్ప కొట్టేదుంటాది...

అంటే మేం ఏ పొద్దేగానీ ఖాళీగా ఉండం. నీ మాదిర్తో వారంలో ఐదురోజులు నిద్రాగారాలు మానుకోని పని చేసి, రెండు రోజులు గమ్మున ఉండం. దినమ్మా పని చేస్తాంటాం. అందుకని మాకు తినింది అరగదనే ఇబ్బందీ లేదు. అలిసి పోయింటాం కదా. నిద్ర రాదనే బాధా లేదు!

నువ్వే ఆలోచించు. వారం రోజులు చేయాల్సిన పనిని, మనిసి ఒగేరోజు చెయ్యగలడా? వారం రోజుల నిద్ర రెండు రోజుల్లో సరిపోతాదా? ఇట్ల చేస్తే ఒంట్లోటియి అన్నీ సక్రమంగా పనిచేస్తాయా?

పంటల కాలంలో కూడా, ఒగోసారి పనులుండవు. నాట్లేస్తాం. ఇంగ కలుపులు తీసేదాంకా ఆడ మేం చేసే పనేముండదు గదా. అట్లాటప్పుడు బండి కట్టుకోని అడివికి పోతాం. బండినిండుకు కట్టెలు కొట్టుకోనొస్తాం. పనుల కాలంలో పొయ్యిలోకి కట్టెలతో ఇబ్బంది ఉండకూడదు కదా.

ఇంగ, మేం చేసే పనికి ఎప్పుడూ భయపడం మీ మాదిరిగా...! నీకు చేసే పనిలో ఏదైనా తేడా వస్తే ఉద్యోగం పోతాదనే భయముంటాది. ఉద్యోగం పోతే ఇంగోటి అంత జీతంతో మళ్లా వస్తాదో రాదో అనే దిగులుంటాది...!

మాకా భయాలేమీ ఉండవు.. అంటే..

చెనిగ్గింజలు ఏసేదానికి దున్నతాంటాము.

సాలు కుంటుపోతాది...!

ఎరువు కుప్పలు చిల్లాడతాంటాము.

ఒగతావన ఎక్కువ ఇంగో తావన తక్కవ పడతాది....!

చేన్లు తొవ్వతా ఉంటాము.

యాడన్నా కలుపుమొక్క తప్పోతాది....!

వరిమడికి యూరియా కొట్టాల...

దుడ్డులేక రెండు రోజులు ఆలెశ్య మయితాది...!

వరి కోతలు కొయ్యాల.

రెండు రోజులు మనుషులు దొరకలా....!

ఇట్లా ఇబ్బందులే మాకుండేది. ఇయ్యన్నీ ఇబ్బందులే కాదు. మా పనులు కొంచెం అట్లా ఇట్లా అయినా, ఒగరోజు ఇట్లా, అట్లా అయినా బాధుండదు. మాకెవురికీ భయముండదు.

అదే నీకు... నువ్వు చేస్తాండే ఉద్యోగంలో రోజూ ఇబ్బందిపడతాంటావు. భయపడతాంటావు. నేను గమనించినా కదా.



మేం గూడా భయపడే కాలాలుండాయి.

చెనిక్కాయలు ముదిరినాంక, వానలు పట్టుకుంటే మోసులొస్తాయి.

వరి కోసి కళ్లంకాడ ఏసినాంక, వానలు పట్టుకుంటే మోసులొస్తాయి.

గింజలు ఏసినాంక, వానలు పడకుంటే సరిగా మొల్చవు.

బుడ్డలు దిగినాంక, వానపడకపోతే వాటికి గింజపడదు.

కాయలు ముదిరినాంక, వానలు పడకుంటే భూమిలోనించి వాటిని ఎల్లదీయలేం.

ఇట్లాంటప్పుడే కొంచెం దిగులు. అయితే అందరికీ ఇట్లే ఉంటాది గదా. ఏదైనా పంటలో నష్టం వచ్చినా, మా తల తీసి మొలేసేవాడుండడు. సేద్దం మా చేతుల్లో లేకుండా పెరుక్కొనేవాడుండడు!

అదే మీకు... నేను చెప్తాండేది ఎందుకో... నువ్వే ఆలోచించుకో....!

ఇంగ.. ఏమాత్రం పనుల్లేని రోజులు కొన్ని ఉంటాయి. ఎండాకాలం చెరువులన్నీ ఎండిపోయింటాయి. బావులకింద మాత్రమే సేద్దం సాగయితా ఉంటాది. చానామంది సేద్దం పనులు లేక ఖాళీగానే ఉంటారు.

అప్పుడు చూడాల నువ్వు మా కుశాల..

చింతచెట్లకిందికి పోయి పుట్టాచెండాడతాం.

గోలీలాడతాం. జిల్లాంకోదాడతాం... రేత్తిరయితే ఎన్నెట్లో ఉప్పరాపట్టే, బల్లుడు ఆడతాం... అంటే, శారీరక శ్రమ లేకుండా ఏ రోజూ ఉండం. రోజూ కడుపారా తినడం! కంటారా నిద్రపోవడం.

ఇదంతా కష్టపడే విషయం.

ఇంగ పండగలు దేవర్లుంటాయి గదా. మన ఇంటికి ఒగరు రావడమో, మనం ఒగరింటికి పోవడమో ఉంటాది. ఏ చిన్న శుభకార్యం జరిగినా పోవాల్సిందే. ఇప్పుడు.. నువ్వే చూడు. ఉద్యోగంలో చేరినాంక, ఈ రెండేడ్లలో ఎవరింటికి పోయినావు...? మన ఇంటికి ఎంతమంది వచ్చినారు? నీకుండే స్నేహితులందరూ, నీ కంపెనీలో ఉద్యోగాలు చేసేవాళ్లే. నీ సమస్యలే కదా వాళ్లకూ ఉంటాయి. నువ్వు వేరే వాళ్లతో స్నేహం చేస్తే కదా సమాజం ఎట్లుండేది తెలిసేదానికి.

అదే మా రోజుల్లోనా. మన బంధువులనే కాదు, మనూర్లో అనే కాదు.. చుట్టుపక్కలా ముప్పై నలభై ఊర్లల్లో గూడా జరిగే సంగతులు తెలిసి పోతాన్నేయి. ఎవురేం పంట పెడతాండారు. ఎంత సంపాదిస్తాండారు. ఎంత నష్టపోయినారు. ఇయ్యన్నీ మేం తెలుసుకుంటాన్నేం. మన కులమోళ్లు కాక పోయినా, ఇంటికొచ్చి చెప్తే చాలు ఎవరి శుభకార్యాని కయినా పోయి వస్తాన్నేం.

అదే ఇప్పుడు చూడు. నువ్వు పెళ్లి చేసుకోవాలన్నే నీకు పది రోజులు లీవు దొరకదు..! ఔనా కాదా!!?

ఇంగా నువ్వు తిండి గురించి కూడా చెప్పినావు. నువ్వు తినేది కూడా మంచి తిండేనా?

మేం సద్దలు పండిస్తాన్నేం. రాగులు పండిస్తాన్నేం. జొన్నలు పండిస్తాన్నేం. మళ్ల కొన్నాళ్లకు బియ్యం వచ్చినాయి.

సద్దలు దంచి సంగటి చేసుకోని తింటే, ఎంత బలమో తెలుసా?

రాగులు... జొన్నలు... ఇప్పుడు మీరు ఆరోగ్యం కోసరమని రేత్తిరిపూట జొన్నరొట్టెలు తింటా ఉండారు. అప్పుడు మాకు మూడుపూటలా అయ్యేగదా

తిండి. వారంలో ఒగటిరెండు పూటలు ఆరోగ్యం కోసరమని రొట్టెలు తింటా ఉండావు. మేం రోజూ అయ్యే తింటా ఉన్నెప్పుడు, ఇంగ మా ఆరోగ్యం ఎట్లుంటాదో నువ్వే ఆలోచించుకో.

మాగ్గూడా బియ్యం అలవాటయినాంక సంగటి తినేసేది మానేసినాంలే. అయినా బియ్యం అప్పుడు ఎట్లుంటాన్నేయి. మనం తింటా ఉండామే బియ్యం. అయ్యి మిషనల్లో నాలుగైదుసార్లు ఏసి, తళతళ మెరిసేటిగా పాలిష్ పడతారు. అట్ల చేసినాంక మిగిలిన బియ్యం పాసిపోయిన అన్నంతో సమానం కదా... మా రోజుల్లో అయితేనా... నీకు గుర్తుందో లేదో... మనూరికాడ పెద్దబండ ఉండాది. ఆ బండ మీద ఏడెనిమిది తావల గుంతలుండాయి గుర్తుందా. అయ్యి ఏంటియనుకున్నేవు. రోళ్లు. అప్పుడు మిషన్లు లేవు కదా. రోట్లో వడ్లుపోసి రోకళ్లతో దంచి చెరిగి, ఆ బియ్యం వండుకోని తినేవాల్లం. అప్పుడు మాకు తిండి ఆ బియ్యమే. ఆ అన్నమే మాకు ఎంతో అపురూపం. ఇప్పుడు మీరు, ఆరోగ్యం కోసరం దంపుడు బియ్యం తింటా ఉండారు. ఆ బియ్యం అన్నం బాగుండ దని, మోటుగా ఉంటాదని, మళ్లా సన్నబియ్యాలు తింటాండారు. ఇంగ నీకు శక్తేడ్నించి వస్తాది.

నీకు కాయగూరల కత గూడా చెప్తా. ఈడ ఒగటి దొరికితే ఒగటి దొరకవు. ఆకుకూరలు దొరికినా అయ్యి మురికినీళ్లతో సాగుచేస్తాండారని చెప్తాండారు. నిజం ఆ బగమంతునికే తెలల్ల.

మాకు వానాకాలమప్పుడు, ఇండ్ల మిద్దెల మింద అటికి మామిడాకు దొరికేది. దాన్ని పప్పులో ఏసి పుల్లగూర చేస్తాన్నేరు. చేన్లల్లో ఎరబద్దాకు ఉంటాండె. అదీ పప్పులో ఏస్తాండిరి. గోగాకు గురించి చెప్పాల్సిన పనేలేదు. మునగాకు మాదరిస్తాండిరి. అది తినేదానికి రుచిగా ఉంటాండె, కడుపును శుభ్రం చేస్తాండె.

అన్నిరకాల కాయగూరలు పండతాండె. ఇది తినచ్చు ఇది తినగూడదు అని లేకుండా, ఏది ఏ కాలంలో పండితే దాన్ని తింటాన్నేము.

చెనిగ్గింజలు, కందులు, అల్సందలు, అనుములు, నూగులు... అన్నీ పండతాండె.

చెనిగ్గింజలు... ఊరిమిండి, పొడి, చారు, పులుసు.

కందులు... ఊరిమిండి, పొడి, పప్పు, చారు, పులుసు.

అల్సందలు... పుల్లగూర, పులుసు, తాలింపు.

అనుములు... పుల్లగూర, పులుసు.

నూగులు... పొడి, ఊరిమిండి.

అంటే... మేం పంటబెట్టేదాంట్లో ఏదీ పనికిరాకుండా ఉండేది కాదు. అన్నీ మేం తినేటియే. అందుకే అప్పుడు చేతిలో దుడ్డాడకపోయినా, మనిషి కడుపునిండా తిని పుష్టిగా ఉంటాన్నేడు.

ఇబ్బుడు..

రేషనుగుడ్లు మేపతాండారు..

పొద్దుతిరుగుడేస్తాండారు..

చెరుకేస్తాండారు...

పత్తి నాటతాండారు...

అరటి నాటతాండారు...

ఇయ్యి అమ్ముకొనేదానికి తప్ప, తిని బతికే దానికి పనికొస్తాయా?

సరేలే... ఆ కతెందుకులే...

ఇప్పుడు మీరు, డాక్టర్లు అయ్యి తినండి, ఇయ్యి తినద్దండి ఆరోగ్యంగా ఉంటారు... అని చెప్తాండారు.

పద్దన్నే పరిగెత్తండి, సందేళ నడసండి... అని అంటా ఉండారు.



మాకు అప్పుడు ఎవ్వరూ చెప్పేటోల్లు లేరు. అయినా మేం ఆరోగ్యంగానే ఉన్నేం. సుఖంగానే ఉన్నేం. సంతోషంగానే ఉన్నేం...."

అంతవరకూ ఓపిగ్గా నా మాటలు విన్న శ్రీ వెంటనే "అయితే మేం సంపాదించేదానికి, మీరు సంపాదించేదానికీ తేడా లేదా?" అన్నాడు.

నడక అలవాటు లేకపోవడంతో, వాడికి ఆయాసంగా ఉంది.

నగరపాలక సంస్థ ఏర్పాటుచేసిన ఓ చిన్న పార్కుందక్కడ. పార్కులో బెంచీలపైన కూచ్చొన్నేం.

"తేడా ఏముంది?" అన్నాను. నాకు వాడి ప్రశ్న అర్థమయింది. అయినా కావాలనే అడిగినా.

"ఇప్పుడు నాకు నెలకు జీతం డెబ్బైవేలు. అంత సంపాదన మీకుండేదా?" అన్నాడు వాడు. ఆ మాటలంటున్నప్పుడు వాడి ముఖంలో, తాను పెద్ద జీతగాన్ననే గర్వం కనిపించింది.

"నిజమే.. నీ అంత సంపాదన మాకు లేదు. కానీ మా అంత సుఖంగా నువ్వుండావా?" అన్నాను.

"కారు... స్వంత ఫ్లాట్... బ్యాంక్ బ్యాలెన్స్..." అని ఆపేశాడు.

"సరే... అవన్నీ సుఖమిస్తాయా? పడుకుని నిద్రపట్టక గంటలు గంటలు దొర్లతా ఉంటే సుఖమా? తినింది అరక్కపోతే సుఖమా...? కడుపునిండా కోరింది తినలేనప్పుడు, కంటారా నిద్రపోలేనప్పుడు మిగిలినవి ఎన్ని ఉన్నా లేనట్టే!" అన్నాను.

ఆ మాటలతో వాడి మనసు బాధపడు తుందని తెలుసు. అయినా సరే అన్నాను.

"ఇప్పుడు నీకు ముప్పై ఏండ్లయితాండాది. నాకు ఇరవై ఏండ్లకే పెండ్లయింది. నా వయసు వాళ్లకు చానామందికి, ఇంకా ముందే పెండ్లయింది. గవర్నమెంటు, పెండ్లివయసు ఇరవై ఒకటిగా నిర్ణయించింది. కనీసం ఇరవై ఐదేండ్లకయినా పెండ్లి చేసుకోవాల కదా... ఇప్పుడు నీకు ఐదేండ్లు ఇంకా ఎక్కువయింది. అయినా పెండ్లి కాలా... ఉద్యోగంలో ఇంత ఒత్తిడి అనుభవిస్తా ఉండేవాడివి. రేపు పెళ్లయినాంక భార్యతో మాత్రం సుఖంగా ఉంటావా? సుఖమనేది డబ్బుతోనే వస్తుందా?"

కాసేపు మౌనంగా ఉన్నాక "డబ్బులేకుంటే సుఖం ఉంటుందా?" అన్నాడు శ్రీ.

"నేనలా అన్నానా?.. సంపాదనే లోకంగా బతకద్దు అంటాండాను. ఫ్లాట్లు కొనుక్కుని నాలుగ్గదుల్లో బందీగా ఉండద్దని అంటాండాను. పచ్చదనం కోసరం, ప్రశాంతంగా ఉండటం కోసరం ప్రయత్నించమంటాండాను. నా ఆరోగ్యం వెనక రహస్యం కూడా అదే. ఇంతకుమించి నేనేమీ చెప్పలేను" అన్నాను.

మౌనంగా ఆలోచిస్తూ కూర్చున్నాడు శ్రీ.

నా శ్రీమతి చనిపోయి ఐదేళ్లయింది. అయినా నేను పల్లెలోనే ఉండాను. పొలం పనులు చేయిస్తా. చేస్తా మనుషుల్లోనే ఉండాను. వేసవి కావడంతో, పనులు కూడా ఏమీ లేకపోవడంతో కొడుకు దగ్గరికి వచ్చినా. నన్ను నగరం రమ్మని కొడుకు బలవంతం చేసినా, నేనీ జనంలో ఉండ లేనని, ఇక్కడ ఉంటే నాకు ఊపిరాడదని చెప్పినా.

శ్రీకి ఆయాసం తగ్గింది. "లే తాతయ్యా వెళ్దాం" అన్నాడు. వాడి ముఖంలో ఏదో ప్రశాంతత. నడవటం మొదలుపెట్టినా, నా అడుగుజాడల్లో నడక మొదలుపెట్టినాడు శ్రీ.